క్లుప్తంగా

బోనాల పండుగ



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంతో పాటు సంకలమద్ది గ్రామంలో శుక్రవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. బోనాలను అందంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు.

ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శ్రీహరి నాయక్

స్టేషన్ మహబూబ్‌నగర్: టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ విభాగం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చిన్నదర్పల్లి కుచ్చతండాకు చెందిన శ్రీహరినాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఆదివాసీ అధ్యక్షుడు లింగంనాయక్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

టైరు పగిలి లారీ బోల్తా



అడ్డాకుల: మండలంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై శాఖాపూర్ సమీపంలో టైరు పగిలి పోవడంతో లారీ బోల్తా పడగా డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. తాండూర్ నుంచి చెన్నైకు లారీలో పౌడర్‌ను తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారుజామున ఘటన చోటు చేసుకుంది. టైరు పగిలిపోవడంతో అదుపు తప్పిన లారీ రోడ్డు కిందకు దూసుకెళ్లింది. బోల్తాపడిన లారీని క్రేన్ సాయంతో పైకి తీయించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

జూనియర్ కళాశాల మంజూరుపై హర్షం

మహమ్మదాబాద్: మండలకేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు కావడంపై యువత, వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా మండలానికి జూనియర్ కళాశాల కావాలని ఎన్నోమార్లు దరఖాస్తులు ఇచ్చామని మాజీ ఎంపీపీ శాంతీబాయి అన్నారు. ఇన్నాళ్లకు కల నెరవేరిందని పేర్కొన్నారు.

కేసులు బనాయించిన ఘనత వారిదే

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీ మంత్రులపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోవర్ట్ ఆపరేషన్ చేస్తున్నారని, బీసీలకు వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించడం సరికాదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ వర్గాలపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించిన ఘనత మంత్రిదేనని ఎద్దేవా చేశారు.

'గృహలక్ష్మి' వివరాల సేకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సొంత స్థలం కలిగిన పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి పట్టణంలోని 49 వార్డులకు కలిపి మొత్తం 4,780 దరఖాస్తులు అందాయి. వీటిని ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మున్సిపల్ కార్యాలయంలో అధికారులు స్వీకరించారు. కాగా, శుక్రవారం నుంచి క్షేత్ర స్థాయిలో మున్సిపల్ సిబ్బంది పరిశీలిస్తోంది. ఈ మేరకు ఆయా వార్డుల్లో దరఖాస్తుదారులు పేర్కొన్న ప్రదేశానికి వెళ్లి ఆరా తీస్తున్నారు. మొదటిరోజు సుమారు 500 మంది దరఖాస్తుదారుల పూర్తి వివరాలను సేకరించారు. నెలాఖరు వరకు కొనసాగనుంది. అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నారు.

చిన్నచింతకుంట: నెల్లికొండిలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలిన చేపట్టారు. లో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గండేడ్/మహమ్మదాబాద్: గృహలక్ష్మి పథకం కింద లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించారు. ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, ఎంపీఈఓ శంకర్‌నాయక్, ఏపీఓ హరిశ్చంద్రుడు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పాపన్న



మహబూబ్‌నగర్‌లో నివాళి అర్పిస్తున్న గంథాలయ సంస్థ చైర్మన్‌రాజేశ్వర్‌గౌడ్



నవాబుపేట వేడుకల్లో పాల్గొన్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్) : అణగారిన వర్గాల వారి జీవితాలలో వెలుగు నింపిన బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గ్రీన్ బెల్ట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బహుజనులను యుద్ధ వీరులుగా తీర్చిదిద్దిన గొప్పవ్యక్తి అని కొనియాడారు. జిల్లా బీసీ సంక్షేమాధికారి ఇందిరా, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, కృష్ణకుమార్‌గౌడ్, రాజు, సాయిలు పాల్గొన్నారు.

నవాబుపేట: సర్వాయి పాపన్న తెలంగాణ ప్రజలకు ఆదర్శప్రాయుడని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పాపన్న జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. అరాచకాలకు ఎదురునిలిచిన ధీశాలి పాపన్న అన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం మహనీయుల జయంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహిస్తు వారికి ప్రత్యేక గుర్తింపులు తీసుకువస్తోందన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల కార్యాలయం పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలో మారుమూల గ్రామాల రోడ్లకు మహర్దశ వచ్చిందని బీటీలుగా మారుతున్నాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వివరించారు. సీతమ్మతండా, చెన్నారెడ్డిపల్లి, కూచూర్, కారుకొండ, పుట్టోనిపల్లి, తిమ్మయ్యపల్లి గ్రామాలకు బీటి రోడ్లు మంజూరైనట్లు వివరించారు. అలాగే దేపల్లి, సత్రోనిపల్లి, నాకరోడ్డు, అమ్మపూర్ రోడ్లకు త్వరలో మంజూరు పత్రాలు వస్తున్నట్లు వాటికి సైతం టెండర్లు పిలవనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య, రైతు బంధు చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, వెంకటేష్, నర్సింహనాయక్, ప్రతాప్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో బీసీ విద్యార్థిసంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అధ్యాపకులు భూమయ్య, రామ్మోహన్, అర్జున్, నాయకులు తాయప్ప, అజయ్, బాబు, శశి, మారుతి, గణేష్ పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో గౌడ సంఘం నాయకులు వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, హరిగౌడ్, నిరంజన్‌గౌడ్, భాస్కర్‌గౌడ్. రాఘవేందర్ పాల్గొన్నారు.

రాజాపూర్: మండలంలో గౌడసంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, చంద్రకాంత్‌గౌడ్, నర్సిములుగౌడ్, బాలయ్యగౌడ్ పాల్గొన్నారు.

గండేడ్: వెన్నచేడ్‌లో సర్పంచ్, గౌడ సంఘం నాయకులు చంద్రయ్య, నర్సిములు, రాములు, ఆంజనేయులు, శ్రీనివాస్, ఎల్లయ్యగౌడ్, నరేష్‌గౌడ్ , వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: సామాజిక న్యాయం కోసం పోరాడి అన్యాయాన్ని ఎదిరించిన వ్యక్తి సర్దార్ పాపన్న గౌడ్ గౌడసంఘం నాయకులు అన్నారు. మండలంలో నిర్వహించిన వేడుకల్లో రాజుగౌడ్, ఆంజనేయులు గౌడ్, వేణుగౌడ్, బాలరాజ్, వెంకటేశ్, రాఘవేందర్‌పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో గౌడసంఘం నాయకుడు బాలవర్ధన్‌గౌడ్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. రజకసంఘం జాతీయ నాయకుడు శ్రీనివాస్, బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలో గౌడసంఘం అధ్యక్షుడు వై.పవన్‌కుమార్‌గౌడ్, జగన్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, రాజారాములు, బాలుగౌడ్, లక్ష్మీనారాయణ, భరత్ పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల గ్రామంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సత్యనారాయణ, ఆంజనేయులుగౌడ్, రవీందర్‌గౌడ్, కొండయ్య, రేవతి, శివరాములు, బుగ్గన్న, రాజు తదితరులు ఉన్నారు.



వెన్నాచేడ్‌లో వేడుకలు



రాజాపూర్‌లో..



వేములలో..

మాజీ ఎమ్మెల్యేకు నివాళి

మిడ్జిల్: మాజీ ఎమ్మెల్యే ఎద్మ కిష్టారెడ్డి వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి నివాళి అర్పించారు. మాజీ జెడ్పీటీసీ భీమయ్యగౌడ్, గౌస్, సాయిలు, సంపత్, మల్లికార్జున్‌రెడ్డి, పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



మహబూబ్‌నగర్ రూరల్: అర్బన్ తహసీల్దార్‌గా బి.నాగార్జున శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి.పార్థసారథి షాద్‌నగర్‌కు బదిలీ అయ్యారు. కాగా నాటకీయ పరిణామాల నేపథ్యంలో నాగార్జునకు కీలకమైన అర్బన్ తహసీల్దార్ బాధ్యతలు అప్పగించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, భూ కబ్జాలు, ఫైళ్ల మాయం తదితర అంశాలు కొత్త తహసీల్దార్‌కు సవాళ్లు విసరనున్నాయి. బదిలీల నేపథ్యంలో జూనియర్ అయిన ఆయనకు అగ్రపీఠం వేయడంతో సీనియర్ అధికారుల సహకారం ఉంటుందోలేదోనని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాలు మార్గనిర్దేశకాలు

గండేడ్: జీవితంలో లక్ష్యసాధనకు పుస్తకాలు చక్కటి మార్గ నిర్దేశకాలని వీరశైవ లింగబలిజ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలోని లైబ్రరీకి 500 పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పుస్తకాలు మంచి నేస్తాలని అన్నారు. అందులోని /జ్ఞానాన్ని సముపార్జించి ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య, సత్యసాయి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి

అడ్డాకుల: ఆయుర్వేద వైద్యంపై ప్రజలు అపోహలను వీడి అవగాహన పెంచుకోవాలని మండల ఆయుర్వేద వైద్యురాలు లావణ్య పేర్కొన్నారు. రాంచంద్రాపూర్‌లో శుక్రవారం ఆయూష్‌శాఖ ద్వారా శిబిరాన్ని నిర్వహించి పరీక్షలు చేశారు. అవసరమైన స్థానిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. సర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

భూత్పూర్: పట్టణంలోని న్యూ ఎర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు యునానీ డిస్పెన్సరీ వైద్యులు డా. జహీరోద్దీన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేసినట్లు తెలిపారు. శాబాజ్ ఆహ్మద్, సాబేర్, పాఠశాల కరస్పాండెంట్ క్రాంతి కుమార్, హెచ్‌ఎం. కె.భరద్వాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'విద్యార్థి, ఉద్యమకారుల సత్తాచూపుతాం'

జడ్చర్ల టౌన్: రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి విద్యార్థి, ఉద్యమకారుల సత్తా చూపుతామని ఓయూ జేఏసీ చైర్మన్ కల్వకుర్తి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన సమరదీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థుల త్యాగాల పునాదులపై ఏర్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన కేసీఆర్ విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేస్తున్నారన్నారు. ఉద్యమకారులను అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాలను కలుపుకుని రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. తమ సమరదీక్ష కోసం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట టెంట్ వేస్తే అనుమతి లేదంటూ దాన్ని ఎమ్మెల్యే తొలగింప జేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్ దానం హరిబాబు, కృష్ణయాదవ్, మధు, రమేష్‌నాయక్, లోకేష్‌నాయక్, జగన్, వినోద్, బీంరాజ్‌లు పాల్గొన్నారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దీక్ష అక్కడే నిర్వహించారు.

'ఎంజేపీ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి'

హన్వాడ: మండలకేంద్రంలోని ఎంజేపీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి కారణమైన ప్రిన్సిపాల్ స్వర్ణలతపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంజేపీ గురుకులాన్ని వారు సందర్శించారు. ఘటనకు కారణాలను తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. సరైన వసతులు కల్పించకుండా సమస్య ఎదురైతే విద్యార్థులు ప్రశ్నిస్తే ప్రిన్సిపల్ భయభ్రాంతులకు గురి చేసినట్లు ఆరోపించారు. ప్రిన్సిపాల్ తీరే ఘటనకు కారణమన్నారు. సమగ్ర విచారణ చేపట్టి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు భరత్, శ్రీనాథ్, నందు, ఈశ్వర్, మణికంఠ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మిడ్జిల్: పెద్దగుంట్ల తండా, మిడ్జిల్, కొత్తూర్, బోయిన్‌పల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ రాజునాయక్ పరిశీలించారు. ఏర్పాటు చేయవలసిన వసతుల గురించి వివరించారు. ఆర్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు



కలశ పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు

భూత్పూర్: అన్నాసాగర్‌లో రెండో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం పునః విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం కొనసాగింది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మంజుల దంపతులు, మాతృమూర్తి వరలక్ష్మమ్మ, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, కొత్తకోట ఎంపీపీ మౌనిక, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, విండో డైరెక్టర్ అశోక్‌రెడ్డి, ముడా డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు మంత్రుల రాక..

వేడుకలకు శనివారం మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు రానున్నారు.

కాపరులు వృద్ధిలోకి రావాలి



అడ్డాకుల: గొర్రెల కాపరులకు ప్రభుత్వం రాయితీపై గొర్రెలను అందజేస్తున్నందునా కాపరులు వాటిని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ అన్నారు. మూసాపేట మండలం వేముల గ్రామంలో 30 మంది గొర్రెల లబ్ధిదారులకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సరఫరా చేసిన గొర్రెల దాణాను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి మధుసూదన్, ఎంపీటీసీ సత్యనారాయణ, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, కొండయ్య, శివరాములు, రేవతి, రవీందర్‌గౌడ్, రాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బూరెడ్డిపల్లి శివారులోని నక్కలబండ తండాకు చెందిన ప్రభుత్వ భూమిని కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని వార్డు అధ్యక్షుడు మహేష్‌తోపాటు మరికొందరు శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. మంగళికుంట తండాకు చెందిన కొందరు భూమిని కబ్జా చేసేందుకు యత్నించగా తాము వెళ్లి అడ్డుకున్నామని, అట్టి భూమిని కాపాడి శ్మశానవాటికకు, కమ్యూనిటీహాల్, ఇళ్లులేని వారికి ఇవ్వాలని కోరారు. భీమ్లా, వెంకటేశ్, శంకర్, భానుచందర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీని నెరవేర్చాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేస్తామని ముఖ్యమంత్రి 2014లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మజారెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 3వ రోజుకు చేరుకున్న సందర్భంగా సంఘీభావం తెలిపారు. 18 సంవత్సరాలు పని చేయించుకొని ఇప్పుడు కొత్త రిక్రూట్‌మెంట్ చేస్తామనడం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రామ్మోహన్, పి.జయమ్మ, గిరిజ, అన్నపూర్ణ, పద్మజ, రేణుక, మంజుల, కృష్ణవేణి పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి..

భూత్పూర్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన 15 మంది పార్టీలో చేరారు. మత్స్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఎంపీపీ శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ఉన్నారు.

దృఢమైన ఎముకలతో వృద్ధాప్యం కనిపించదు

పాలమూరు: ఎముకలు దృఢంగా ఉంటే వృద్ధాప్యం కనిపించకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆర్థో సర్జన్ వైద్యుడు నర్సింహులు అన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని నవోదయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మగవారికి కన్నా ఆడవారికి ఎముకలు క్షీణించే ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. కాల్షియం లభించే పదార్థాలు అంతగా తినకపోవడం, ఒంటికి తగినంత ఎండ తగలకపోవడం, వ్యాయామం చేయకపోవడం వంటివి ఇందుకు కారణాలు అవుతాయని నివారించుకోవడానికి కాల్షియం, విటమిన్ డి మాత్రలు ఉపయోగపడుతాయని తెలిపారు. అధ్యక్షుడు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, రాజసింహుడు, నారాయణరావు, ఉమేష్‌కుమార్, అశోక్, ఎల్లారెడ్డి, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్: కొత్తూర్ సమీపంలోని దుందుభీ వాగు నుంచి గురువారం రాత్రి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ట్రాక్టర్లు మిడ్జిల్‌కు చెందినవిగా గుర్తించి కేసునమోదు చేసినట్లు వివరించారు.

'డబ్బులు ఇవ్వని వారినే పట్టుకుంటున్నారు'

కాగా వాగు నుంచి గురువారం రాత్రి దాదాపు 10 ట్రాక్టర్లు ఇసుక నింపుతుండగా డబ్బులు ఇవ్వని మూడింటిని మాత్రమే పట్టుకున్నారని కొంతమంది ప్రత్యక్ష సాక్షులు ఆరోపించారు. రోజు ట్రాక్టర్‌కు రూ.వేయి చొప్పున వసులు చేస్తున్నారని అన్నారు. స్టేషన్‌లో ఒక కానిస్టేబుల్, మధ్యవర్తుల ద్వారా తతంగం సాగుతోందన్నారు. విషయంపై ఎస్‌ఐని వివరణ కోరగా పెట్రోలింగ్ సిబ్బంది ఇద్దరు మాత్రమే నైట్ డ్యూటీలో ఉండడంతో మూడు ట్రాక్టర్లు మాత్రమే పట్టుకోగలిగామని, మిగతా ట్రాక్టర్ల వారు పరారు అయినట్లు వివరించారు.

శ్రావణ శుక్రవారం పూజలు





స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రావణ మాసపు మొదటి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు శక్తి ఆలయాల్లో మహిళలు విశేష పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవాడి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మల్లెపూలతో అలంకరించి పూజలు చేశారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు.

మారుమోగుతున్న వేదమంత్రాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలో నిర్వహిస్తున్న విశ్వశాంతి మహోత్సవం సందర్భంగా వేదమంత్రాలు మారుమోగుతున్నాయి. శుక్రవారం విశేష చండీసహిత గజలక్ష్మీ హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక లక్షకుంకుమార్చన, లక్ష గాజులార్చన చేపట్టారు. శనివారం శ్రీలక్ష్మీనృసింహ సహిత సుదర్శన, లక్ష్మీనారాయణ, నవగ్రహ సంతాన లక్ష్మీహోమాలు చేయనున్నారు.

'మభ్యపెట్టేందుకే కళాశాల ఏర్పాటు తెరమీదికి'

చిన్నచింతకుంట: ప్రజలను మభ్యపెట్టేందుకే చిన్నచింతకుంటకు జూనియర్ కళాశాల ఏర్పాటును బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెరమీదికి తెచ్చిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ముగ్గురు బీఆర్‌ఎస్ మంత్రులు మూడుసార్లు మంజూరు చేశామని చెప్పుకొచ్చినా నేటికీ పునాది పడలేదన్నారు. చిన్నచింతకుంటలో జూనియర్ కళాశాల, 30 పడకల ఆస్పత్రి, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని గత ఏడాది బీజేపీ ఆధ్వర్యంలో 65 రోజులు దీక్షలు చేపట్టామన్నారు. ఎవరూ పట్టించుకోలేదని, ఇప్పుడు ప్రభుత్వం మంజూరు చేసిందంటూ లేనిపోని హడావుడీ చేస్తున్నారని మండి పడ్డాడు. బీఆర్‌ఎస్ నాయకులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, మండల అధ్యక్షుడు దశరథ్, నాయకులు రాములు, వెంకటన్న, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

జీవసంరక్షణపై విద్యార్థులకు అవగాహన

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జీవ సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జీవశాస్త్ర విభాగం అధిపతి శ్రీనివాసులు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మానవుడికి జీవించే హక్కు ఉన్నట్లుగానే ప్రకృతిలోని ప్రతి జీవికి జీవించే హక్కు ఉందన్నారు. మానవుడు తన బలంతో, తెలివితో ఇతర ప్రాణుల జీవించే హక్కును కాలరాస్తున్నాడని నివారించాల్సిన అవసరం ఉందన్నారు. బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య వివిధ రకాల సర్పాల గురించి ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు నీరజ, పరిశోధక విద్యార్థులు రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక బస్సు

స్టేషన్ మహబూబ్‌నగర్: నిజ శ్రావణమాస పౌర్ణమిని పురస్కరించుకొని మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను నడపనున్నట్లు డిపో మేనేజర్ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న తేదీన మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి సాయంత్రం 5 గంటలకు బస్సు బయలుదేరి, మార్గమధ్యంలో కాణిపాకం విఘ్నేశ్వరుడి, వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం 30వ తేదీ రాత్రి 7 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణ అనంతరం 31న మధ్యాహ్నం బస్సు బయలుదేరి అదే రోజు రాత్రికి మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం 9441162588, 9985320529, 7382827102 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అప్రమత్తత అవసరం

జడ్చర్ల టౌన్: మండలంలోని ఆలూరు గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కళాజాత బృందం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రంగా లేకపోవటం వల్ల కలిగే అనర్థాలు, దోమల వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. అప్రమత్తత అవసరమన్నారు.

టీబీ శిబిరం

ఆలూరు గ్రామంలో శుక్రవారం టీబీ శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30మంది స్ఫూటం (తెమడ) పరీక్షలు చేశారు. కార్యక్రమంలో గంగాపురం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ జాక్విలిన్, ఎల్‌టీ శ్రీనివాసులు, హెల్త్ అసిస్టెంట్ వహీద్, ఏఎన్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.